క్లుప్తంగా

ఓటు విలువ తెలుసుకో..



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్‌ఐ కరుణకుమార్

బొండపల్లి: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఆర్‌ఐ కరుణకుమార్ సూచించారు. మండల కేంద్రంలోని అక్షర పాలిటెక్నిక్ కాలేజీలో శుక్రవారం ఓటు నమోదుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఓటు హక్కు ఆవశ్యకతను గ్రామీణ ప్రాంత ప్రజలకు వివరించి వారిలో చైతన్యం తీసుకురావాలని కోరారు.

బీజేపీ నేతల ఇంటింటి ప్రచారం

బొండపల్లి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దేవర ఈశ్వరరావు అన్నారు. మండలంలోని బొండపల్లి, అంబటివలస, గోట్లాం, రోళ్లవాక గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మండపాక భారతి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌బీమా తక్షణ సాయం

గుర్ల: మండలంలోని దమరసింగి గ్రామానికి చెందిన కడగల లక్ష్మణరావు శుక్రవారం మృతి చెందారు. మృతుడు వైఎస్సార్‌బీమా పథకం లబ్ధిదారుకావడంతో తక్షణ సాయంగా రూ.10 వేలను వైఎస్సార్‌సీపీ నాయకుడు మీసాల ప్రసాద్ శుక్రవారం మృతుని కుటుంబ సభ్యులు కడగల ఎల్లమ్మకు అందజేశారు. కుటుంబ పెద్దను కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి వైఎస్సార్‌బీమా పథకం ఆసరాగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రాజారావు, పంచాయతీ కార్యదర్శి చిన్నారావు ఉన్నారు.

ఎకరాకు 31 నుంచి 33 క్వింటాళ్ల దిగుబడి

జామి: మండలంలో లొట్లపల్లి, జామి, భీమసింగి గ్రామాల్లో శుక్రవారం పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. గ్రామంలో ఎంపిక చేసిన నాలుగు పంటపొలాల్లో 5 చదరపు మీటర్ల విస్తీర్ణంలో పంటకోత ప్రయోగం చేపట్టగా.. ఒక్కో ప్లాట్‌కు 21 కిలోల చొప్పున దిగుబడి వచ్చినట్లు వ్యవసాయాధికారి కిరణ్ కుమార్ తెలిపారు. ఈ లెక్కన ఎకరాకు సరాసరి 31 నుంచి 33 బస్తాల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ప్రతీ గ్రామంలోను 4 పంటకోత ప్రయోగాలు చేపట్టనున్నట్లు చెప్పారు. దిగుబడి ఆధారంగా ప్రధానమంత్రి ఫసల్‌బీమా వర్తిస్తుందన్నారు.

ఓటు నమోదుపై నిర్లక్ష్యం వద్దు



బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలకు సూచనలిస్తున్న ఈఆర్వో సుదర్శన్ దొర

శృంగవరపుకోట: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలు కచ్చితమైన సేవలు అందివ్వాలని ఈఆర్‌ఓ సుదర్శన్ దొర అన్నారు. స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో శుక్రవారం ఓటర్ల నమోదుపై బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్ దొర మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలనేదే ఎన్నికల కమిషన్ లక్ష్యమని అన్నారు. ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా యువతకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటు నమోదు కోసం వచ్చే ఏ అభ్యర్థనను నిర్లక్ష్యం చేయొద్దన్నారు. చేర్పులు, మార్పులు, తొలగింపులు, బదిలీలు, బూత్ బదలాయింపులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎలక్షన్ డీటీ వి.నారాయణమ్మ, పి.కీర్తన పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష

వేపాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సూచించారు. గృహ, రెవెన్యూ, విద్యుత్, వైద్య, ఉపాధిహామీ శాఖల పనితీరుపై సమీక్షించారు. అనంతరం ఆర్‌బీడీ కో–ఆర్డినేటర్ బి.జానకి జీవవైవిధ్య సంరక్షణ రాయబారి కార్యక్రమంపై అధికారులకు అవగాహన కల్పించారు. జీవవైవిధ్య పరీక్షకు 15 అంశాలతో కూడిన కార్యాచరణ ప్రణాళికను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కూర్మనాథ్‌పట్నాయక్ పాల్గొన్నారు.

సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం కావాలి

వేపాడ: మండలంలో వల్లంపూడి గ్రామంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ నేతృత్వంలో హౌసింగ్ డే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసి సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలన్నారు. లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. జగనన్న లేఅవుట్‌లో అవసరమై మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు నిర్మాణాలు పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



చీపురుపల్లి రూరల్: గరివిడి మండలం కొండపాలెంలో పార్టీ జెండాకు వందనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



వేపాడ: వేపాడలో టీ దుకాణం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి టిఫిన్ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు



మెరకముడిదాం: సోమలింగాపురంలో సంక్షేమ పథకాల డ్యాష్‌బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



ఎస్.కోట: స్థానిక సచివాలయంలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



దత్తిరాజేరు: దత్తిరాజేరులో సంక్షేమ పథకాల లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు



బొండపల్లి: బొండపల్లిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గంట్యాడ: కొర్లాంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతన్న ఎంపీపీ హైమావతి

రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా.. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నా.. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా.. మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. ఎస్‌కోట నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో శుక్రవారం నిర్వహించిన 'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నాలుగున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. గ్రామ సచివాలయాల వద్ద సంక్షేమ పథకాల డాష్‌బోర్డులను ప్రదర్శించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ప్రజలు, వివిధ సంఘాల నేతలతో సమావేశమై రాష్ట్రానికి జగనే సీఎంగా ఎందుకు కావాలో వివరించారు. చీపురుపల్లి, గజపతినగరం నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు.

– ఎస్.కోట, చీపురుపల్లి, గజపతినగరం



గజపతినగరం: దావాలపేట గ్రామ సచివాలయం వద్ద పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, జెడ్పీటీసీ గార తవుడు, తదితరులు(దావాలపేటలో)



చీపురుపల్లి: సచివాలయం-2 పరిధిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీ శిరీష, తదితరులు



కొత్తవలస: బలిఘట్టాంలో గ్రామస్తులకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరణ



మాట్లాడుతున్న ఎంపీపీ చలంనాయుడు

బొండపల్లి: రబీ సీజన్‌కు సంబంధించి రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చల్లా చలంనాయుడు సూచించారు. మండల కేంద్రమైన బొండపల్లి సచివాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ తాళ్లపూడి కృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రైతుల నుంచి ధాన్యం సేకరించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బోద్దల చిన్నంనాయుడు, ఏఓ పి.వి.మల్లికార్జునరావు, గ్రామ సర్పంచ్ బొండపల్లి ఈశ్వరరావు, వైస్ ఎంపీపీ జి.ఈశ్వరరావు, కోళ్ల వెంకటరమణ, బండారు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ




దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్, ఎంపీడీఓ, తదితరులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం డిజిటల్ విద్యను ప్రోత్సహించి ట్యాబ్‌లను అందజేస్తోందని ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, ఎంపీడీఓ జి.భాస్కరరావు అన్నారు. గరివిడి భవిత కేంద్రంలో శుక్రవారం విజన్–2025లో భాగంగా కొండపాలెం, వెదుళ్లవలస, కాపుశంబాం ఉన్నత పాఠశాలల్లో, గొట్నంది ప్రాథమికోన్నత పాఠశాలలో వినికిడి లోపం, అంధత్వం ఉన్న దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం దివ్యాంగ విద్యార్థుల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. సాధారణ విద్యార్థులతో సమానంగా ఉండేలా ప్రత్యేక అవసరాల పిల్లలను సాంకేతికంగా తీర్చిదిద్దేందుకు సాఫ్ట్‌వేర్, యాప్స్‌ను ట్యాబ్‌లో ఇన్‌స్టాల్ చేసి అందించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ పి.రామారావు, డి.అప్పన్న, సహిత విద్య ఉపాధ్యాయులు ఎస్.ఈశ్వరరావు, పి.సుమలత, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఓటరుగా పేరు నమోదు చేసుకోండి

శృంగవరపుకోట: ఓటు హక్కు వజ్రాయుధమని, దాన్ని సక్రమంగా వినియోగించుకుంటే మీ భవిష్యత్ మంచిగా ఉంటుందని తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. పుణ్యగిరి డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కు ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. 18 సంవత్సరాలు పూర్తయిన వారంతా ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. డిసెంబరు 9వ తేదీ వరకు ఓటు నమోదుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందన్నారు. డిసెంబర్ 2,3 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ వి.నారాయణమ్మ, పి.కీర్తన, సూపర్‌వైజర్లు, కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయినికి సత్కారం



ఉపాధ్యాయినిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ ఈశ్వరరావు, తదితరులు

వేపాడ: వేపాడ ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయినిగా సేవలందించి బదిలీపై వెళ్లిన వి.మంజరిని శుక్రవారం ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఆమెను సత్కరించి, పాఠశాల అభివృద్ధికి ఆమె అందించిన సేవలను కొనియాడారు.

● సైన్స్‌పై ఆసక్తిని పెంచేలా..



కొత్తవలస: అడ్డూరువానిపాలెం వద్ద ఉన్న కేజీబీవీలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు



చీపురుపల్లి: గురుకుల బాలికల పాఠశాలలో చెకుముకి టాలెంట్ టెస్ట్ బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు

జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో పాఠశాల స్థాయిలో శుక్రవారం నిర్వహించిన చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 8,9,10 తరగతులకు చెందిన వందలాది మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. కొత్తవలస మండలంలో 450 మంది, చీపురుపల్లి మండలంలో 1100 మంది, గరివిడి మండలంలో 980 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు జేవీవీ ప్రతినిధులు తెలిపారు. ఈ పరీక్షలో ప్రతిభకనబరచిన విద్యార్థులు ఈ నెల 30న జరిగే మండల స్థాయి పోటీల్లో పాల్గొంటారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు, వారిలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు జేవీవీ విద్యాశాఖతో కలిసి ఈ పరీక్షలను నిర్వహిస్తుంది.

– సాక్షి నెట్‌వర్క్



గుర్ల: చెకుముకి పరీక్ష కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ భానుప్రకాష్, జనవిజ్ఞాన వేదిక సభ్యులు



చీపురుపల్లి రూరల్: గరివిడి మండలం తాటిగూడ హైస్కూల్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎం మధుసూదన్, జేవీవీ సభ్యులు

బాణసంచా విక్రయిస్తే కేసులు నమోదు

దత్తిరాజేరు: దీపావళి పండగ సందర్భంగా అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందని పెదమానాపురం ఎస్సై శిరీష అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. బాణసంచా విక్రయాలకు ఎవరికీ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, ఎవరైనా నిబంధనలు అతిక్రమించి మందుగుండు సామగ్రి విక్రయాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టపాసులు కాల్చేటప్పుడు పిల్లలకు కాటన్ దుస్తులు వేయాలని, ప్రమాదకరమైన మందుగుండు సామాన్లు పేల్చరాదని సూచించారు.

బాలల సైన్స్ కాంగ్రెస్‌లో విద్యార్థిని ప్రతిభ

లక్కవరపుకోట: జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన 31వ జిల్లాస్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ కార్యక్రమంలో మండలంలోని జమ్మాదేవిపేట వద్ద ఉన్న జ్యోతీరావుపూలే పాఠశాలకు చెందిన 9వ తరగతి చదువుతున్న కావ్య ప్రదర్శించిన ప్రాజెక్టుకు ద్వితీయ స్థానం లభించిందని పాఠశాల ప్రిన్సిపాల్ యు.విజయకుమార్‌పాత్రో తెలిపారు. ఈ ప్రదర్శనలో సుమారు 300 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించినట్లు ఆయన తెలిపారు. కాగా ప్రాజెక్టు గైడ్ టీచర్ జి.ఇంద్రజా ఆధ్వర్యంలో గుర్రపుడెక్క మొక్కలతో కావ్య తయారు చేసిన యోగా మ్యాట్ ప్రాజెక్టు ద్వితీయ స్థానం లభించిందన్నారు. విద్యార్థినితో పాటు గైడ్ టీచర్ ఇంద్రను శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

తాగునీటి బోరు ఏర్పాటు



అల్లువీధి పాఠశాలలో బోరు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ అరుణ, జెడ్పీటీసీ సరయు

జామి: మండల కేంద్రమైన జామిలో అల్లువీధి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మండల పరిషత్ నిధులతో తాగునీటి బోరు ఏర్పాటుకు ఎంపీపీ సబ్బవరపు అరుణ, జెడ్పీటీసీ గొర్లె సరయు శుక్రవారం శంకుస్థాపన చేశారు. అలాగే భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద జెడ్పీ నిధులు రూ.2 లక్షలతో బోరు నిర్మాణానికి సర్పంచ్ పిన్నింటి ఆదిలక్ష్మి శంకుస్థాపన చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, ఎంపీటీసీ వి.వరలక్ష్మీ, అల్లు సత్యాజీ, ఎంఈఓ గంగరాజు, కంది నరసింగరావు పాల్గొన్నారు.

మూడోరోజు ఉత్సాహంగా ముందుకు..



కొత్తవలసలో ఎమ్మెల్సీ రఘురాజుతో కలిసి నడుస్తున్న నాయకులు

కొత్తవలస: వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి అధికారంలోకి రావాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలనే సంకల్పంతో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చేపట్టిన పాదయాత్ర మూడోరోజు పూర్తిచేసుకుంది. శుక్రవారం ఉదయం అడ్డూరువానిపాలెం వద్ద ప్రారంభమై దేసుపాత్రునిపాలెం సమీపంలో ఉన్న పైలాన్ వద్ద దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి ముందుకు సాగారు. సాయంత్రానికి ఎస్.కోట నియోజకవర్గంలో పాదయాత్ర పూర్తి చేసుకొని విశాఖ జిల్లా పెందుర్తి నియోజకవర్గంలోకి ప్రవేశించారు. కొత్తవలసలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వేపాడ ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, కొత్తవలస జెడ్పీటీసీ నెక్కల శ్రీదేవి తదితరులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. జయహో జగనన్న అంటూ నినాదాలు చేశారు. మరోమారు జగనన్న ముఖ్యమంత్రి కావాలని చేపట్టిన ఈ యాత్ర దిగ్విజయంగా పూర్తి కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వావిలపాడులో 'ఫ్యామిలీ డాక్టర్'

వేపాడ: మండలంలో వావిలపాడు గ్రామంలో వేపాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎ.ధరణి ఆధ్వర్యంలో 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. బీపీ, సుగర్, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. అనంతరం బెడ్ రెస్ట్ పేషెంట్లకు ఇంటి వద్దకు వెళ్లి వైద్య సేవలందించారు.

ధాన్యం కొనుగోలు సమర్థవంతంగా చేపట్టాలి

● ఏడీ కోటేశ్వరరావు



ధాన్యం కొనుగోలుపై శిక్షణ ఇస్తున్న అధికారులు

చీపురుపల్లి: త్వరలో ప్రారంభంకానున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని వ్యవసాయశాఖ ఏడీ కోటేశ్వరరావు సూచించారు. పట్టణంలోని కస్పావీధిలో పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో చీపురుపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న టీఏలు, డీఈఓలు, వీఏఏలకు శుక్రవారం ధాన్యం కొనుగోలుపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 ఖరీఫ్‌కు సంబంధించి ప్రతీ రైతుభరోసా కేంద్రంలోను ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలన్నారు. ధాన్యం సేకరణకు పంపించే ప్రతీ వాహనానికి జీపీఎస్ పరికరం తప్పనిసరిగా ఉండాలన్నారు. గోనె సంచులు, లేబర్ చార్జీలు, రవాణా చార్జీలు ప్రభుత్వమే రైతులకు చెల్లిస్తుందని స్పష్టం చేశారు. అంతేకాకుండా 2023 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి మద్దతు ధర క్వింటాకు రూ.2183గా ప్రభుత్వం నిర్దేశించిందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ సీహెచ్.రఘు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడండి



రైతులకు విత్తన కిట్లు అందజేస్తున్న పైడిరాజు, తదితరులు

గజపతినగరం: గజపతినగరం రైతుభరోసా కేంద్రం –2లో మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు సామంతుల పైడిరాజు అధ్యక్షతన శుక్రవారం వ్యవసాయ సలహామండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ–క్రాప్ బుకింగ్ శాతశాతం పూర్తిచేసినందుకు వ్యవసాయశాఖ సిబ్బందిని అభినందించారు. వ్యవసాయశాఖ ఏడీఏ కె.మహరాజన్ మాట్లాడుతూ.. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించేందుకు జీపీఎస్ పరికరం అమర్చి ఉన్న వాహనాలనే వినియోగించాలన్నారు. రబీలో మొక్కజొన్న సాగుచేసే రైతులు తక్కువ పంటకాలం ఉన్న విత్తనాలను వేసుకోవాలని సూచించారు. అనంతరం రైతులకు విత్తన కిట్లను ఉచితంగా అందజేశారు. ఏఓ ధనలక్ష్మి, వ్యవసాయశాఖ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

హార్టీకల్చర్ నిధులు ఎందుకు మళ్లించారు?



నిధుల మళ్లింపుపై హార్టీకల్చర్ అధికారిని నిలదీస్తున్న సభ్యులు

మెరకముడిదాం: పులిగుమ్మి గ్రామానికి సంబంధించి హార్టీకల్చర్‌కు చెందిన నిధులు మరో గ్రూప్‌కు ఎందుకు మళ్లించాల్సి వచ్చిందో చెప్పాలని రాష్ట్ర క్షత్రియ పరిషత్ సభ్యుడు కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్ హార్టీకల్చర్ అధికారిని నిలదీశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తాడి కృష్ణవేణి అధ్యక్షతన, ఎంపీడీఓ ఎం.రత్నం ఆధ్వర్యంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఐసీడీఎస్ పనితీరుపై చర్చ సందర్భంగా చినబంటుపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని పక్కనే ఉన్న గర్భాం సెక్టారులో కాకుండా దూరంలో ఉన్న ఉత్తరావల్లి సెక్టార్‌లో ఎందుకు చేర్చాల్సి వచ్చిందని చినబంటుపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు కోట్ల విశ్వేశ్వరరావు నిలదీశారు. మండలంలో ఈక్రాప్, పంటనష్టం సర్వేల వివరాలు వెల్లడించాలని ఏఓ శ్రావణితేజను సభ్యులు అడిగారు. దీనిపై ఆయా శాఖల అధికారులు సమాధానం ఇచ్చారు. సమావేశంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.